ఎమ్మెస్సీ (జంతుశాస్త్రం) ఎంట్రన్స్ కోచింగ్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు ఎంఎస్సీ(జంతుశాస్త్రం) ఎంట్రెన్స్ తరగతులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మంచి యూనివర్సిటీలో సీటు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి విజయ్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ నర్సింగ్‌రావు, సంతోష్‌కుమార్, దయాకర్, అష్రఫ్ అలీ, డాక్టర్ రాజ్‌కుమార్, సలేహా విద్యార్థులు పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

శుక్రవారం 25 ఆగస్టు 2023

బాధిత కుటుంబానికి శ్రీహరిరావు పరామర్శ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రానికి చెందిన నడిపి భూమన్న గురువారం అనారోగ్యంతో మరణించగా విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అధైర్యం చెందొద్దని, అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అట్ల రాంరెడ్డి, ఒడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సమ్మెట రవి, నగేష్ పాల్గొన్నారు.



కారును ఢీ కొట్టేదెవరు..?

- ఇప్పటికే ఖరారైన అధికార పార్టీ అభ్యర్థులు
- కాంగ్రెస్, బీజేపీ నుంచి పలువురు సమాయత్తం
- అధిష్టానానికి హస్తం నాయకుల దరఖాస్తులు
- బీజేపీలోనూ టికెట్ల కోసం పోటాపోటీ ప్రయత్నాలు
- త్వరలోనే వెల్లడికానున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు

ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఖరారయ్యారు. ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో పదిస్థానాలకు పోటీ చేసే ఆ పార్టీ అభ్యర్థుల జాబితాను వెల్లడించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ బరిలో అధికార పార్టీ అభ్యర్థులు ఎవరో తెలిసిపోవడంతో..వారికి ప్రత్యర్థులుగా నిలిచే ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరోనని ఉత్కంఠ రేపుతోంది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలోని నియోజకవర్గాల్లో హస్తం పార్టీ నాయకులు ఇప్పటికే అధిష్టానానికి టికెట్లు కేటాయించాలని దరఖాస్తు చేశారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ఒకరి కంటే ఎక్కువ మంది దరఖాస్తులు చేయడంతో ఎవరికి టికెట్ వస్తుందోననే ఆందోళన వారిలో నెలకొంది. దరఖాస్తుకు శుక్రవారం వరకు గడువు ఉండటంతో మరికొంత మంది పార్టీ టికెట్ కోసం దరఖాస్తులు అందజేసే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోపక్క బీజేపీ నుంచి బరిలో నిలిచేందుకు పలువురు ఆశావహులు పోటీ పడుతున్నారు. ఆ పార్టీ టికెట్ దక్కించుకునేందుకు ఎవరికి వారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక వామపక్షాలతో పాటు బీఎస్పీ, డీఎస్పీ వంటి పార్టీలు తమ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు సంసిద్ధమవుతున్నాయి.



టిక్కెట్ కోసం దరఖాస్తు అందజేస్తున్న సుజాత, సంజీవ్‌రెడ్డి, సాజిద్‌ఖాన్



దరఖాస్తు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి మరో నాలుగు నెలల సమయం ఉంది. కానీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ టికెట్ల కేటాయింపులో మిగితా పార్టీల కంటే ముందు వరుసలో నిలిచింది. ఎన్నికలకు మూడు నెలల ముందుగానే టికెట్లను ఖరారు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది స్థానాలకు అభ్యర్థులను వెల్లడించారు. పది సిట్టింగ్ స్థానాల్లో ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్ స్థానాల్లో అభ్యర్థులను మార్చగా.. మిగితా ఏడు స్థానాల్లో సిట్టింగులకే టికెట్లు కేటాయించింది. అధికార పార్టీ అభ్యర్థుల జాబితా వెల్లడికావడంతో వీరికి పోటీగా నిలిచే అభ్యర్థులెవరని సర్వత్రా చర్చకు దారితీస్తోంది. కాంగ్రెస్ టికెట్ల కోసం ఇప్పటికే ఆ పార్టీ దరఖాస్తులు తీసుకుంటోంది. శుక్రవారం వరకు గడువు ముగియనుంది. ఈ ప్రక్రియలో ఒకటి, రెండు నియోజకవర్గాలు మినహా మిగితా అన్ని చోట్ల టికెట్ల కోసం నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇది వరకే పార్టీలో ఉన్నవారితో పాటు కొత్తగా చేరిన వారు.. ఔత్సాహికులు ఆ పార్టీ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీలోనూ టికెట్లు దక్కించుకునేందుకు పోటీ నెలకొంది. నిర్మల్ నియోజకవర్గం మినహా మిగితా అన్నిచోట్ల ఒకరి కంటే ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. ఇప్పటికే అధికార పార్టీ అభ్యర్థులను ఖరారు చేసిన క్రమంలో ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు సైతం తమ అభ్యర్థులను వెల్లడించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముందుగా ప్రకటిస్తేనే అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు ఎక్కువ సమయం ఉంటుందని చెబుతున్నారు.

ప్రతిపక్ష పార్టీల్లో టికెట్ల వేట..!

ఆదిలాబాద్ పశ్చిమ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ టికెట్లను దక్కించుకునేందుకు తీవ్ర పోటీ నెలకొంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జోగు రామన్న బరిలో నిలువగా.. కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచేందుకు టికెట్ కోసం పోటీ నెలకొంది. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ సంజీవరెడ్డితో పాటు ఇటీవల పార్టీలో చేరిన కంది శ్రీనివాస్‌రెడ్డి,ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేశారు. వీరితో పాటు రిటైర్డ్ బ్యాంకు అధికారి దామోదర్‌రెడ్డి సైతం దరఖాస్తు అందించారు. బీజేపీ నుంచి టికెట్ కోసం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బోథ్ నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ నుంచి నేరడిగొండ జడ్పీటీసీ సభ్యుడు అనిల్‌జాదవ్ బరిలో నిలువగా.. కాంగ్రెస్ నుంచి పోటీకి నరేష్‌జాదవ్, ఆడె గజేందర్, వన్నెల అశోక్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ సైతం టికెట్ కోసం దరఖాస్తు అందించారు. బీజేపీ నుంచి ప్రస్తుత పార్లమెంటు సభ్యుడు సోయం బాపురావు బోథ్ అసెంబ్లీ బరిలో ఉంటారని ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మరోసారి పోటీలో నిలువగా.. కాంగ్రెస్ టికెట్ కోసం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావుతో పాటు సారంగపూర్ జడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంబడి రాజేశ్వర్ దరఖాస్తు చేసినట్లు తెలిసింది. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బరిలో నిలువనున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి ఎన్ఆర్ఐ జాన్సన్‌నాయక్ పోటీ చేస్తుండగా.. కాంగ్రెస్ నుంచి వెడ్మ బొజ్జు, చారులత రాథోడ్, భరత్‌చౌహాన్, పరిశ్రమలశాఖ విశ్రాంత జీఎం రాంకిషన్‌నాయక్, కిషోర్‌నాయక్‌లు దరఖాస్తు చేశారు. వీరితో పాటు ఇటీవల బీఆర్ఎస్ టికెట్ దక్కకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్ కూడా కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసినట్లు తెలిసింది. బీజేపీ నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, హరినాయక్, జానుబాయి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ముధోల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పోటీ చేస్తుండగా.. కాంగ్రెస్ నుంచి మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎన్ఆర్ఐ కుమెవార్ కిరణ్‌కుమార్, ఆనంద్‌రావుపటేల్ టికెట్ కోసం దరఖాస్తు చేసినట్లు తెలిసింది. బీజేపీ నుంచి టికెట్ కోసం రామారావుపటేల్, డా.రమాదేవీ, మోహన్‌రావు పటేల్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా ఎవరికి వారు టికెట్ల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా ఎవరికి దక్కుతాయో ..ఎవరికి నిరాశ మిగులుతోందో త్వరలోనే వెల్లడికానుంది.

అంగన్‌వాడీ కేంద్రం..పోషకాహారానికి బహుదూరం..

- రవాణా సౌకర్యం లేక పలు కేంద్రాలకు రెండు నెలలుగా నిలిచిన పోషకాహారం



ఈ ఫొటోలో భుజంపై మోసుకొని వెళుతున్నది కాగజ్‌నగర్ మండలం దుబ్బగూడ మినీ అంగన్‌వాడీ కేంద్రం టీచర్. ఈ కేంద్రంలో కిషోరబాలికలు, ప్రీ స్కూల్ పిల్లలు మొత్తం 21 మంది ఉన్నారు. ఈ కేంద్రానికి కార్గో వాహనం వచ్చే పరిస్థితి లేకపోవడంతో అంకుసాపూర్ గ్రామంలో పోషకాహారాన్ని వేసి వెళుతున్నారు. ప్రతీ నెలా ఈ టీచర్ అంకుసాపూర్‌కు వచ్చి భుజంపై సంచులు మోసుకుంటూ వాగు దాటి వెళ్లాల్సిన పరిస్థితి.



ఈ ఫొటోలో ఎడ్ల బండి నడుపుతూ వెళుతున్నది అంగన్‌వాడీ టీచర్. మరి ఎడ్ల బండి ఎందుకు నడుపుతోందని అనుమానం వస్తోంది కదా. ఈమె కాగజ్‌నగర్ మండలం మారెపల్లి అంగన్‌వాడీ టీచర్. ఈ కేంద్రంలో మొత్తం 91 మంది ఉన్నారు. ఇందులో ప్రీ స్కూల్ పిల్లలు తొమ్మిది మంది కాగా, కిషోర బాలికలు 20 మంది, బాలామృతం తీసుకునే పిల్లలు 46 మంది ఉన్నారు. వీరికి ప్రతీ నెలా ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని ఆ కేంద్రం వరకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్గో వారిదే. కాని రవాణా సౌకర్యం లేక 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అంకుసాపూర్ కేంద్రంలో వేసి వెళుతున్నారు. అక్కడి నుండి ఈ టీచర్ ఈ విధంగా ఎడ్ల బండిలో అటవీ మార్గం గుండా ప్రతి నెలా తీసుకువెళుతోంది.



మూడు కేంద్రాల రెండు నెలల ఫుడ్ మెటీరియల్‌తో గది నిండిపోయిన అందవెల్లి కేంద్రం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇక్కడే కాదు, మారుమూల గ్రామాలలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి ఇదే. గత నెలకు సంబంధించిన పోషకాహారం మిగిలితే దానిని పిల్లలకు సర్దుబాటు చేయడం, లేకపోతే ఆ ఫుడ్ మెటీరియల్ వచ్చేంత వరకు పిల్లలకు పోషకాహారం అందించకపోవడం తప్పితే ఆ టీచర్లు ఏమి చేయలేని పరిస్థితి నెలకుంటోంది. గ్రామంలో బాలింతలకు, కిషోరబాలికలకు పోషకాహారం అందించడంతో పాటు ప్రీ స్కూల్ పిల్లలకు ఆటాపాటలు, విద్యాబుద్ధులు నేర్పాలనే ఉద్దేశ్యంతో నెలకొల్పిన అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యం పూర్తిగా నెరవేరడం లేదు. పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం, వెళ్లడం తప్పితే వారికి పోషకాహారం అందడం లేదు. దీనికి ప్రధాన కారణం పోషకాహార రవాణా బాధ్యతను గత కొన్ని నెలల నుండి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్టీసీ కార్గోకు అప్పగించడమే. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం లేకపోవడం, ఆ గ్రామాలకు కార్గో వాహనం వెళ్లే సౌకర్యం లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతోంది.

పెద్దవాగు వంతెన కూలడంతో...

కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగు వంతెన కూలడంతో వాగు అవతలి అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు నెలలుగా ఫుడ్ మెటీరియల్ అందడం లేదు. భట్టుపెల్లి సెక్టార్ పరిధిలో మొత్తం 21 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాగు అవతల జగన్నాథ్‌పూర్, బోడేపల్లి 1, 2 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ మూడు కేంద్రాలకు ప్రతీ నెలా బాలామృతం, బాలామృతం ప్లస్, మురుకులు, కిషోరామృతం, మసాలా ప్యాకెట్లు అందించాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్గోదే. కాని వంతెన కూలడంతో రెండు నెలలుగా వీటిని కాగజ్‌నగర్ మండలం అందవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలోనే వేస్తున్నారు. వంతెన లేక రవాణా సౌకర్యం కరువవడంతో ఫుడ్ మెటీరియల్ ఇక్కడే ఉండిపోయింది. అందవెల్లితో పాటు ఈ మూడు కేంద్రాల ఫుడ్ మెటీరియల్‌తో ఉన్న ఒక్కగానొక్క గది నిండిపోయింది. దీనితో ఈ కేంద్రంలోని పిల్లలను గదిలో కూర్చొబెట్టే స్థలం లేక ఆరుబయట కూర్చోబెట్టి విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు ఆటలు ఆడిస్తున్నారు. బోడేపల్లి-1 కేంద్రంలో ఏడు నెలల నుండి 3 ఏళ్ల పిల్లలు 45 మంది ఉండగా, పోషకాహార లోపంతో బాధపడేవారు ఇద్దరు ఉన్నారు. ప్రీ స్కూల్ పిల్లలు 13 మంది ఉన్నారు. వీరికి గతంలో మిగిలిన ఫుడ్‌ను అందిస్తున్నట్లు అక్కడి టీచర్ చెపుతున్నా అది రెండు నెలలుగా ఎలా సరిపోతుందన్నది అనుమానమే. ఇదే కాకుండా కాగజ్‌నగర్ మండలం మాలిని అంగన్‌వాడీ కేంద్రానికి సిర్పూరు (టి)లో ఫుడ్ మెటీరియల్ వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సమస్య ఏర్పడుతున్నా ఉన్నతాధికారులు స్పందించడం లేదు. వాస్తవానికి ఫుడ్ మెటీరియల్ తమ కేంద్రానికి వచ్చిన తర్వాతనే కార్గో వారికి అక్కడి అంగన్‌వాడీ టీచర్ వేలి ముద్ర వేసి నిర్ధారించాలి. కాని అంగన్‌వాడీ కేంద్రాలకు మెటీరియల్ రాకున్నా వచ్చినట్లుగా వేలిముద్ర వేస్తుండడం ఇక్కడ కొసమెరుపు.

29న ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 29న ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ముందు సింగరేణి కాంట్రాక్టు కార్మికులు వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని 40 కోట్ల మంది అసంఘటిత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల కాళ్ల కింద బానిసలుగా మార్చివేశాయని మండిపడ్డారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగభద్రత, కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. దేశ ప్రయోజనాలు, ప్రజల ప్రయోజనాల కోసం నెలకొల్పిన జాతీయ పరిశ్రమలను కార్పొరేట్లకు కట్టబెట్టిన కేంద్ర ప్రభుత్వం తామే గొప్ప దేశభక్తులమని, ప్రజలను భ్రమలకు గురిచేస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అసంఘటిత, సంఘటిత కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లు తెగించి రాజీలేని పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా అధ్యక్షులు, కార్యదర్శులు శ్రీనివాస్, సికిందర్, కార్మికులు పోచం, శ్రీనివాస్, కుమార్, పోసుబాయి, శకుంతల, సావిత్రి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు ప్రారంభం

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమణరావు ఆధ్వర్యంలో సభ్యత నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్‌టియు ముందు వరుసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు కొక్కుల గంగాధర్, ప్రధాన కార్యదర్శి పి రవీందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ బాబు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు అమర్నాథ్, లతీఫ్, ఇందిరా పాల్గొన్నారు.

తాండూర్ : పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో జడ్పిహెచ్ఎస్ అచ్చలాపూర్, రేచిని, తాండూర్, కేజీబీవీ తాండూర్ పాఠశాలలో సభ్యత్వం నమోదు చేయించారు. పంచాయతీరాజ్ మాసపత్రిక చీఫ్ ఎడిటర్, జిల్లా అధ్యక్షులు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ తాండూర్ పాఠశాల ఉపాధ్యాయురాలు దండనాయకుల శిరీషాని జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఎంపిక చేసి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఇన్నారెడ్డి మాట్లాడుతూ పిఆర్సి కమిటీ వేసి ఐఆర్ 20శాతం వెంటనే ప్రకటించాలని, ప్రమోషన్లు, బదిలీలు వెంటనే జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంబరం శ్రీనివాస్, రవీందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వనమాల బాలాజీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి నర్ర తిరుపతి, మండల గౌరవ అధ్యక్షురాలు బాస జయప్రద, మహిళా కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాకే ఓట్లు అడగాలి

- ఎస్‌కేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి సింగరేణి కార్మికుల ఓట్లు అడగాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గనిలో బ్రాంచ్ ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికుల సొంతింటి పథకాన్ని ప్రభుత్వం అమలు చేసి ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు. గత సింగరేణి ఎన్నికలకు ముందు ప్రభుత్వ అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్‌ను గెలిపించుకోవడానికి మారు పేర్లు సరి చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని, డిపెండెంట్‌ల వయసు గతంలో పెంచిన ప్రభుత్వం నేడు పట్టించుకోవడం లేదని తెలిపారు. రెండు నెలలకు ఒకసారి సమీక్ష చేస్తానన్న ముఖ్యమంత్రి ప్రభుత్వం వచ్చాక ఎన్ని సార్లు సమీక్షలు చేశారో చెప్పాలని అన్నారు. సింగరేణిలో విపరీతమైన రాజకీయ జోక్యం పెరిగి సంస్థ క్వార్టర్లను ఆక్రమించుకోవడం లేదా కూలగొట్టడం, ఎదురు తిరిగిన అధికారులను ట్రాన్స్‌ఫర్ చేయించి కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని యూనియన్లు కలిసి ఆర్ఎల్సీ వద్ద చేసిన అగ్రిమెంట్లపై యాజమాన్యాన్ని ఆదేశించడం లేదని, కనీసం కాంట్రాక్టు కార్మికులకు గెజిట్ చేయాల్సిన జీవో 22న కూడా గెజిట్ చేయకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం వాటాను పెంచిందని చెప్పుకోవడమే తప్ప గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సింగరేణి ఆస్తుల విషయంలోనూ, నిధుల విషయంలోనూ తొంగి చూడలేదని, ఈ ప్రభుత్వం మాత్రం సింగరేణి సొమ్ముతో అభివృద్ధి చేసుకుంటూ సంస్థను ఆర్థికంగా నష్టం చేస్తోందని మండిపడ్డారు. కోల్ ఇండియాలో ఆగస్టు జీతంతో కలిపి ఏరియర్స్ చెల్లిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు రావాల్సిన వేల కోట్ల బకాయిలను ఇవ్వకపోవడం వల్ల నేడు ఏరియర్స్ ఎలా చెల్లించాలో తెలియక కార్మికులకు ఏం చెప్పాలో అర్థం కాకా ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారని తెలిపారు. కార్మిక వాడల్లో కనీస సౌకర్యాలైన రోడ్లు, పారిశుధ్య వ్యవస్థను పట్టించుకోవాలని, మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు కేటాయించాలని, సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టాలని, ప్రతి ఏరియాకు ఒక ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేసి కార్మికుల పిల్లలకు సరైన విద్యను అందించేలా చూడాలని డిమాండ్ చేశారు. సిఐటియు చేస్తున్న సొంతింటి పథకం పోరాటానికి తాము సైతం అంటూ గురువారం గనిలోని కార్మికులు యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో బ్రాంచ్ గౌరవాధ్యక్షులు మిడివెల్లి శంకర్, బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, శ్రీపతి బానేష్, సాయిల శ్రీనివాస్, ఆవునూరి మహేష్, ఇత్తినేని వెంకటేష్, రవీందర్, గంగాధరచారి పాల్గొన్నారు.

ఇస్రో విజయంపై విద్యార్థుల హర్షం



నవతెలంగాణ-బాసర

ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయంపై మండల కేంద్రంలోని హంస వాహిని ప్రయివేటు పాఠశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఇస్రో విజయంపై విద్యార్థులు ఇస్రో, చంద్రయాన్ ఆకారంలో కూర్చుని తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ దేశాయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్నూర్ : మండలంలోని తాడిహత్నూర్ గ్రామ శ్రీ సేవాదాస్ స్కూల్‌లో చంద్రయాన్-3 విజయవంతంపై గురువారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబురాలు జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ జాదవ్ ఉమాజి అధ్వర్యంలో చంద్రయాన్-3 మోడల్ తయారు చేయించి విద్యార్థులకు వివరించారు. అనంతరం జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు.

డ్రైవింగ్ లైసెన్సు కోసం దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ - కౌటాల

డ్రైవింగ్ లైసెన్సులకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఐ మధుకర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు కావాల్సిన యువకులు పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. లైసెన్సులు ఇప్పించేందుకు పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, చదువు ధృవీకరణ పత్రం, బోనాఫైడ్, మెమో, రెండు పాస్ ఫోటోలతో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

నేటి నుండి 'వస్తున్న మీకోసం' పాదయాత్ర ప్రారంభం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కాంగ్రెస్ నాయకులు కుచాడి శ్రీహరిరావు 'వస్తున్న మీ కోసం' పాదయాత్రను శుక్రవారం నుండి ప్రారంభిస్తున్నట్టు కాంగ్రెస్ మండల నాయకులు ఈటెల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 7గంటలకు మండలంలోని బాబాపూర్ గ్రామంలో ప్రారంభమై కంజర్ గ్రామం మీదుగా కొనసాగుతుంది. సాయంత్రం 5గంటలకు నర్సాపూర్, కాశిగూడ గ్రామాల్లో కొనసాగుతుంది. ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా పాదయాత్ర సాగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు ఎండగడతామని తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలో గురువారం ఏడీఏ జాటోత్ మనోహర్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల యజమానులు బిల్లులో బ్యాచ్ నెంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కాలం చెల్లిన మందులు రైతులకు అమ్మకూడదని, అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్ ఉన్నారు.

కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు

నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి ఉద్యోగం చేస్తూ మృతి చెందిన, మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో గురువారం అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. అందులో ఇద్దరు ఎంఎన్‌సీ(నెలవారి జీవన భృతి), ఒకరు లసం(ఏకమొత్తం చెల్లింపు) మరొకరు కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు కుటుంబ సభ్యులను ఖైరిగూడ పీఓ ఎన్.సత్యనారాయణ, డీజీఎం (ఎఫ్అండ్ఏ) రామారావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణ్‌రావు హాజరైన అభ్యర్థులను ప్రశ్నించి ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. సింగరేణి సంస్థ ద్వారా ఉండే బెనిఫిట్స్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, ఖైరిగూడ ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు, సంక్షేమ అధికారి వేణు పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద ర్యాలీ

నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ నుండి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ గెలుపును ఆకాంక్షిస్తూ నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ప్రజా ఆశీర్వాద ర్యాలీ ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రంలో గురువారం సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు ఇందుకు సంబంధించి చర్చించారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుండి చెన్నూర్‌కు వస్తున్న సుమన్‌కు జిల్లా సరిహద్దుల్లో గోదావరి వంతెన వద్ద స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు సిద్ధమవుతున్నారు. అనంతరం రాజీవ్ రహదారి మీదుగా ఇందారం, చెన్నూర్ ఎక్స్ రోడ్డు, రసూల్‌పల్లి, జైపూర్ నుండి చెన్నూర్ వరకు బైక్ ర్యాలీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మండలం నుండి 2వేల బైక్‌లకు తగ్గకుండా ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బాలురు ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసే వైద్యపరీక్షలు నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గుతో ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. అన్నం తినక ముందు చేతులు పరిశుభ్రంగా కడిగి ఆహారం తీసుకోవాలని అన్నారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.



కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డల పెండ్లిలు భారం కాకూడదని కళ్యాణలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టిందని అందులో భాగంగానే గురువార తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజమోహన్ వివిధ గ్రామాలకు చెందిన 13మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. తాసిల్దార్ కార్యాలయంలో గురువారం తహసిల్దార్ రాజమోహన్ కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అజీమ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



పేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



నవతెలంగాణ-తాంసి

పేద కుటుంబాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం భీంపూర్ మండల కేంద్రంలో ఇరవై మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ, జెడ్పీటీసీలతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పథకాలు భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేవని అన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలిచేది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. సీఎం కేసీఆర్ ఆడపిల్ల పెండ్లి చేయలేని స్థితిలో ఉన్న పేద కుటుంబాలకు పెద్ద దిక్కుగా రూ.1,00,116లు అందజేస్తున్నారని అన్నారు. మళ్లీ కేసీఆర్‌ను సీఎం చేయడానికి వచ్చే ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పని చేసి బోథ్ నియోజక వర్గంలో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగురవేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింబాజి, జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ రత్నాప్రభ సంతోష్, కన్వీనర్ నాగయ్య, నాయకులు నరేందర్ యాదవ్, మొట్టె కిరణ్, వెంకటేష్, కపిల్ యాదవ్, మహేందర్ భగువాన్‌దాస్, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

- కేంద్ర రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మేధోజు



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ రీజినల్ డైరెక్టర్ అనురాధ మేధోజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి నివారణ, గర్భిణీ స్త్రీల ఓపీ, ప్రసవాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం అమలు తీరును పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న వైద్యసేవలు గ్రామీణ ప్రజలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లెప్రసీ రాష్ట్ర సంయుక్త డైరెక్టర్ జాన్‌బాబు, జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన, లెప్రసీ కంట్రోలర్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, డీపీఎంఓ మధుసూదన్, వామన్‌రావు, మండల వైద్యాధికారులు సాగర్, కిరణ్, హెల్త్ అసిస్టెంట్ కైలాస్ ఉన్నారు.

ఉద్యోగ భద్రత కలిగిన శాఖలో వీఆర్ఏలను కేటాయించాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్

నవతెలంగాణ-ఖానాపూర్

వీఆర్ఏలను ఉద్యోగ భద్రత కలిగిన శాఖలో కేటాయించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలో బీఆర్ఏతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఇటీవల వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయడంతో వీఆర్ఏలకు కనీస భద్రతా లేని డిపార్ట్‌మెంట్‌లో కేటాయించే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉద్యోగుల అభిప్రాయం తీసుకోక వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా నష్టం జరుగుతుందనీ అన్నారు. ఉద్యోగుల సర్వీసు ప్రకారం ఎక్కడ పరిగణనలోకి తీసుకోక పోవడంతో వీఆర్ఏలకు సీనియారిటీ లేకుండా పోతుందనీ అన్నారు. విద్య అర్హతలను బట్టి ప్రభుత్వశాఖలలో కేటాయించాలనీ, కానీ ఇలాంటి పరిగణలోకి తీసుకోకపోవడంతో ఇబ్బంది కలుగుతుందనీ అన్నారు. ప్రభుత్వం వెంటనే పునరాలోచించాలని అన్నారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తతంగా ఆందోళనలు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య విలాస్, నల్ల నర్సయ్య, రాజన్న, భీమరాజు, రాజమౌళి, కాల్వ పాశం, భూమన్న, సత్తవ్వ, రాధ పాల్గొన్నారు.

బీసీలకు ఆర్థిక చేయూత చెక్కుల అందజేత

నవతెలంగాణ-లోకేశ్వరం

బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకే బీసీ కులవృత్తులకు ఆర్థిక చేయూతను అందించేందుకు చెక్కులను అందజేస్తోందని మాజీ జెడ్పీటీసీ లోలం శ్యామ్ సుందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీసీలకు ఆర్థిక చేయూతను అందించేందుకు వివిధ గ్రామాలకు చెందిన 38 మంది లబ్దిదారులకు రూ.38లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కులవృత్తులకు జీవం పోయడంతో పాటుగా ప్రతి కార్మికుడు కార్మికుడిగా మిగిలి పోకుండా యజమాని కావాలనే ఉద్యేశంతో కేసీఆర్ పేద కుటుంబాలకు బీసీ ఆర్థిక చేయూత పథకం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లలిత భోజన్న, ఎంపీడీఓ సల్మాన్‌రాజ్, పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్‌రావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్, వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి, మండల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ మండల నాయకులు, అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

రిమ్స్‌కు వెళ్లేవారు ఆధార్ తీసుకెళ్లాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌కు వచ్చే రోగులు ఆధార్ కార్డును తమ వెంట తీసుకురావాలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిమ్స్‌లోని వివిధ విభాగాలలో రోగులకు మెరుగైన వైద్యచికిత్సలు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. వైద్య చికిత్సలు అందించేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి అని, అందుకు ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని మహారాష్ట్ర నయాగావ్ ఎమ్మెల్యే రాజేశ్ పవార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అసెంబ్లీ ప్రవాస యోజన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి, మాట్లాడారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముధోల్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ ఎలా గెలుపొందాలనే విషయాలపై మార్గనిర్దేశం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు డా.పడకంటి రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావు పటేల్, మోహనరావు పటేల్, మండల ఇన్‌చార్జీలు, మండల అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగామణి



నవతెలంగాణ-ఖానాపూర్

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం కింద రూ.18 వేలు నిర్ణిత వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగామణి అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతిభవన్ నుంచి ఖానాపూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి తట్టుకొని నిత్యం సేవలు అందిచటంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డులు, రివార్డులు పొందామనీ అన్నారు. కనీస వేతనం నిర్ణయం చేయాలని ఆందోళన చేస్తుంటే, ప్రభుత్వ మాత్రం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. కనీస వేతనం రూ.18వేలు ఇచ్చేవరకు పోరాటం ఆపేది లేదని తెలియచేశారు. ఈనెల 26న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, 29న ఎమ్మెల్యే ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం చేస్తామని తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే చర్చించి, నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరోనా రిస్క్ అలవెన్స్ తన ఖాతాలో వేసుకుంది. కానీ విడుదల చేయటానికి చేతులు రావటం లేదనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీ, ఎరియర్స్ ఇవ్వకుండా అందరికీ కంటే ఎక్కువ వేతనం ఇస్తున్నామని హరీష్‌రావు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారనీ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్ణిత వేతనం రూ.10వేలు అమలు చేస్తున్నారనీ, కేరళ రాష్ట్రలో రూ.18వేలు ఇస్తున్నారని అన్నారు. ధనిక రాష్ట్రం, బంగారు తెలంగాణలో కనీసం ప్రమాద భీమా సౌకర్యం పొందలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొన్నదనీ ఎద్దేవా చేశారు. హరీష్ రావు తప్పుడు ప్రకటనలు ఇవ్వడం మానుకుని హెల్త్ రంగంలో పనిచేస్తున్న ఫ్రెంట్ లైన్ కార్మికులను పర్మినెంట్ చేసి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో ప్రజల ప్రాణాలు కాపాడిన మహిళ సైనికులుగా ఆశా కార్యకర్తలు కంటి వెలుగు, లెప్రసీ, మలేరియా, టిబి గుర్తింపు కార్యక్రమంలో అత్యున్నత పాత్ర వహించారు. కానీ వారికి బిల్లులు మంజూరు చెయ్యలేని స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశా వర్కర్లను గుర్తించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు. వినోదం, రజిత మమతా, జ్యోతి, సుజాత, ఆశలత, గంగరాజు, 80 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల ఆర్థిక చేయూత కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

- బైంసాలో రెండు గంటలకు పైగా రాస్తారోకో
- ఎమ్మెల్యే తీరుపై మండిపాటు

నవతెలంగాణ-భైంసా

బీసీలకు లక్ష రూపాయల రుణ ఎంపికలో అధికారులు పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ మహాగాం గ్రామస్తులు మండిపడ్డారు. గురువారం భైంసాలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మహాగాం గ్రామంలో 190 మంది దరఖాస్తు చేసుకుంటే ఒక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయం ఎలా అందిస్తారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మహాగాం సర్పంచ్ రాకేష్, సిద్దూర్ సర్పంచ్ మారుతి, బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా కోకన్వీనర్ సుంకెట పోశెట్టి మాట్లాడుతూ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన మద్దతుదారులకి ఏకపక్షంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని ఆరోపించారు. గుట్టు చప్పుడు కాకుండా బీసీ ఆర్థిక చేయూత, దళితబంధు ఎంపిక చేసి ఇవ్వడం ఏంటని మండిపడ్డారు. పథకాలు ఎవరికి వస్తున్నాయో కనీసం సర్పంచ్‌లకు సమాచారం లేదన్నారు. రాస్తారోకో పెద్ద మొత్తంలో జరగడంతో ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి రాస్తారోకో స్థలానికి చేరుకోగానే అతనిపై ప్రజలు మండిపడ్డారు. ఎమ్మెల్యే సోదరుడు సూర్యంరెడ్డి చెప్పినట్లు వింటున్నావా అంటూ



ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్దిదారులకు ఎంపిక చేయడంలో అతను ఎవరంటూ మండిపడ్డారు. అధికారులు నిష్పక్షపాతికంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. రెండు గంటల పాటు రాస్తారోకో జరగడంతో కిలోమీటర్ల పొడుగునా వాహనాలు ఎక్కడికి కక్కడే నిలిచిపోయాయి. భైంసా సీఐ ఎల్.శీను ఆందోళన కారులను సముదాయించిన వినకపోవడంతో వారిని అరెస్టు చేయడానికి యత్నించగా మహిళలు చుట్టుముట్టారు. దీంతో ఒక దశలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అర్హులైన వారికి బీసీ ఆర్థిక చేయూతను ఇచ్చే వరకు దశలవారీగా ఆందోళన పోరాటాలను చేపడుతమన్నారు.

యుక్త వయసులో బాలికలు జాగ్రత్తగా ఉండాలి



నవతెలంగాణ-తాంసి

కాలేజిలో చదువుకుంటున్న యుక్త వయసులో ఉన్న అమ్మాయిలు ఎంతో జాగ్రత్తగా ఉండాలని షీటీం అవగాహన బృందం సభ్యురాలు ఎస్సై సునీత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థిని, విద్యార్థుల చదువు ప్రాముఖ్యత మహిళల పట్ల ఎలా ప్రవర్తించాలో యుక్త వయసులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు కేవలం చదువు పట్ల మాత్రమే శ్రద్ధ ఉండాలని అన్నారు. సెల్‌ఫోన్ ఉపయోగించడం చాలా ప్రమాదమని అన్నారు. ముఖ్యంగా బాలికలు సెల్ ఫోన్ వాడోద్దని తమ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ ప్రోఫైల్‌లో పోటోలు పెట్టోదని అన్నారు. ఇతరులకు తమ ఫోన్ నెంబర్లు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వద్దని అన్నారు. ఎవరైనా మిపట్ల దురుసుగా గానీ సెల్ ఫోన్‌తో బ్లాక్ మెయిల్ చేసిన వెంటనే భయపడకుండా పోలీసులకు లేదా తమ కుటుంబ సభ్యులకు తెలపాలని అన్నారు. పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ల మీ దగ్గర తప్పకుండా ఉండాలని అన్నారు. ఇలాంటి ఎలాంటి ఆపదలో ఉన్న షీటీం నెంబర్‌కు ఫోన్ చేయాలని అన్నారు. దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. మీ పేర్లను బయటకు రాకుండా గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాంసి ఎస్సై శివరాం, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, మహిత బృందం సభ్యులు ఇమ్రాన్ ఖాన్, సుజాత పలువురు ఉన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే టికెట్

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-బాసర

ప్రజల ఆశీర్వాదంతో సీఎం కేసీఆర్ రెండో సారి ముధోల్ బీఆర్ఎస్ టికెట్ కేటాయించారని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి బాసర క్షేత్రానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రావడంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. సరస్వతిదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అధికారులు అర్చకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల ఆశీర్వాద బలంతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానిక ప్రజాప్రతినిధులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ రామారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ కన్వీనర్ కొర్వా శ్యామ్, అమృత్



పటేల్, దేవేందర్, మాజీ ఎంపీటీసీలు, పోతన్న, బాలరాజ్ గౌడ్, జ్ఞాని పటేల్, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ అలీ, ఫాసి, లాల్ మియా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాస్మా ఆధ్వర్యంలో చంద్రయాన్ విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-ఖానాపూర్

ట్రాస్మా ఆధ్వర్యంలో గురువారం చంద్రయాన్ విజయోత్సవ ర్యాలీని విద్యార్థులు నిర్వహించారు. ప్రపంచానికి దిక్సూచిగా చంద్రయాన్-3 నిలబడిందని ఖానాపూర్ ప్రయివేట్ పాఠశాలల (ట్రాస్మా) అధ్యక్షులు పుప్పాల మల్లేష్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ప్రభాకర్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుంచి తెలంగాణ తల్లిచౌక్ వరకు విద్యార్థులతో విజయోత్సవ ర్యాలీని ఖానాపూర్ సబ్ ఇన్స్‌పెక్టర్ శంకర్ ర్యాలీని ప్రారంభించారు. చంద్రయాన్-3 మిషన్ బుధవారం జాబిలిపై తొలి అడుగు వేసి అఖండ విజయం సాధించిందని అన్నారు. భారత దేశ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోకు అభినందనలు తెలిపారు. చంద్రుడిపై వాతావరణం, ఖనిజ నిక్షేపాలు, అన్వేషణ చేసి ప్రపంచానికి దిక్సూచిగా విశ్వవిజేతగా నిలబడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం ఖానాపూర్ మండల కార్యదర్శి విద్యాలత, ఉపాధ్యక్షుడు తుమ్మనపెల్లి సంకేత్‌వర్ధన్, జిల్లా బాధ్యలు బండపాటి మనోహర్, ఎం.శ్రీనివాస్, పి.సాబుకుమార్, పి.అనిత, ఏ.ప్రవీణ్‌గౌడ్, పి.గంగాధర్, బి.నాగమోగిలి, ప్రయివేట్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

కేజీబీవీ ఉపాధ్యాయులను వెంటనే రెగ్యులర్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి, ఖానాపూర్‌లోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, అలాగే అన్ని రకాల సెలవులు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు నెలల కింద షిఫ్టింగ్‌లో వచ్చిన కేజీబీవీ ఉపాధ్యాయులకు రెండు నెలల నుంచి వేతనాలు రావడం లేదని అన్నారు. ఈ వేతనాలను జిల్లా విద్యాశాఖ వెంటనే స్పందించి రెండు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు పరంకుశం మురళీధర్, షేక్ ఫాజిల్, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదుపై బీఎల్ఓలకు అవగాహన



నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయా గ్రామాల్లో ఉన్న బీఎల్ఓలకు తహసీల్దార్ ముంజం సోము అవగహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సోము మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామంలో ఉన్న యువతీ, యువకులు ఓటరు నమోదు కానివారికి చివరి అవకాశం కల్పించడం జరుగుతుందని అన్నారు. దీంతో గ్రామంలో ఉన్న ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని ఓటరు లిస్టులో పేర్లు రానివారికి ఓటరు నమోదు చేసుకునేలా కృషి చేయాలని తెలిపారు. ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3తేదిల్లో గ్రామంలో గ్రామపంచయతి కార్యాలయంలో బీఎల్ఓలు అందుబాటులో ఉండి ఓటరు నమోదు ప్రక్రియ నిర్వహిస్తారని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకునేలా చూడాలని అన్నారు. అదే విధంగా ఓటర్ లిస్టులో ఏమైనా తప్పులు ఉంటే అక్కడే సరిచేసుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీప్యూటి తహసీల్దార్ పద్మావతి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విజయ్, బీఎల్ఓలు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తాంసి : అర్హులైన 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తాంసి తహసీల్దార్ లక్ష్మీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26, 27 తేదీల్లో పాటు సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ఓటు నమోదు కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశామని అన్నారు. బీఎల్ఓలు తమ తమ పోలింగ్ స్టేషన్ పరిధిలో అర్హులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. ముఖ్యంగా చదువుకున్న యువకులు గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ విష్ణు జాదవ్, సూపర్‌వైజర్లు మహేందర్, నరేష్ జూనియర్ అసిస్టెంట్లు బాబురావు, దారవేణి రాఘవేంద్ర, స్వామి పాల్గొన్నారు.

తలమడుగు : అర్హులైన 18సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్‌మోహన్ మాట్లాడుతూ ఈనెల 27 తేదీతో పాటు సెప్టెంబర్ నెల 2, 3 తేదీల్లో ఓటు నమోదు కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. బీఎల్ఓలు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్ అర్హులైన వారిని గుర్తించి, తప్పకుండా 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరిని నమోదు చేయాలని బీఎల్ఓలను కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అజీమ్, జూనియర్ అసిస్టెంట్ నరేందర్, రవీందర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మహారాష్ట్ర ఆర్ని నియోజకవర్గ ఎమ్మెల్యే సందీప్ దుర్వే అన్నారు. గురువారం మండలంలోని చాంద(టి) గ్రామంలో ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మనమందరం కలిసికట్టుగా పని చేసి, రాష్ట్రంలో, ఆదిలాబాద్‌లో బీజేపీ జెండాను ఎగురవేయాలని అన్నారు. ప్రపంచ దేశాలు అబ్బుర పడేలా ప్రయోగాలు నిర్వహించి, 140కోట్ల ప్రజల ఆకాంక్షలను తీరుస్తున్న నరేంద్ర మోడీకి, బీజేపీ రుణపడి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, మండల నాయకులు శ్రీనివాస్, సంతోష్, సత్యం, నాందేవ్, ఫరీద్, జ్యోతిరెడ్డి, ధోని జ్యోతి, సునందరెడ్డి, మయూర్ చంద్ర, గంగారెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సేవలు అభినందనీయం



నవతెలంగాణ-ఉట్నూర్

దేశ అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న శాస్త్రవేత్తల సేవలు అభినందనీయమని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ అన్నారు. ఇటీవల ఇస్రో ఆధ్వర్యంలో చంద్రుడిపై చంద్రయాన్-3ని పరిశోధనలలో పాల్గొన్న శాస్త్రవేత్తల టీమ్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన యువ కెరటం షేక్ ముహమ్మద్ ముజమ్మిల్ చదువుల్లో రాణించి, శాస్త్రవేత్తగా ఎదిగి ఇస్రోలో పని చేస్తున్నారని అన్నారు. శాస్త్రవేత్త తండ్రి షేక్ ముహమ్మద్ మాబ్దూం అలీ మండలంలోని లక్కారంలో ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని అన్నారు. కాగా ఆయనను గురువారం ఎంపీపీ ఛాంబర్ సన్మానించి, మిఠాయిలు తినిపించి, శుభాకాంక్షలు తెలిపారు. చంద్రునిపై వివరాలు సేకరించేందుకు దక్షిణ ధృవంపై సురక్షితంగా ప్రయోగించిన చంద్రయాన్-3ని అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్త కృషి ఎంతో ఉందన్నారు. అలాంటి శాస్త్రవేత్తను దేశానికి పరిచయం చేయడం మీకు, జిల్లాకు, ఉమ్మడి జిల్లాకు ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కందుకురి రమేష్, నాయకులు సింగారే భరత్, కాటం రమేష్ ఉన్నారు.

వేతన ఖాతా ద్వారా ప్రమాద బీమా సౌకర్యం

నవతెలంగాణ-నస్పూర్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వేతనానికి సంబంధించిన ఖాతా ద్వారా కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని ఆ బ్యాంక్ ఏజీఎం చంద్రారెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డిని ఆయన గురువారం కలిసి సింగరేణి ఉద్యోగులకు అందిస్తున్న యూనియన్ సూపర్ శాలరీ అకౌంట్ సంబంధించిన అంశాలను వివరించారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు సింగరేణి ఉద్యోగులకు యూనియన్ బ్యాంక్ అకౌంట్ ద్వారా సుమారు రూ.85 లక్షల వరకు బీమా సౌకర్యం లభిస్తుందని, శాలరీ ఎకౌంటు ద్వారా వారి కుటుంబ సభ్యులకు భరోసా ఉంటుందని తెలిపారు. యూనియన్ బ్యాంకులో ఉన్న ఇతర పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు, యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కామేశ్వరరావు, చీఫ్ మేనేజర్ రీజినల్ ఆఫీస్ విద్యాశంకర్, చీఫ్ మేనేజర్ గోదావరిఖని రాఘవులు, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ నస్పూర్ బ్రాంచ్ వంశీ పాల్గొన్నారు.

జెఎన్‌వీలో ప్రవేశానికి నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2024-25 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి గాను దరఖాస్తు గడువు శుక్రవారం (ఈనెల 25)తో ముగియనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కుల కేటగిరీ, పరీక్ష రాసే భాష, రూరల్/అర్బన్ విషయాలను తప్పుగా నమోదు చేసి ఉంటే ఈ నెల 26, 27 తేదీలలో ఆన్‌లైన్‌లో సవరించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ ప్రతిభను పరీక్షించుకునే అవకాశం ఉన్నందున దరఖాస్తు చేసుకోవాలని, ఈ గడువు మళ్లీ పెంచే ప్రసక్తి ఉండదని ఆయన స్పష్టం చేశారు.

ఏఎన్ఎం నోటిఫికేషన్ ప్రతుల దహనం

- కొనసాగుతున్న రెండవ ఏఎన్ఎంల సమ్మె



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెండో ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గురువారం 9వ రోజు నోటిఫికేషన్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా ఏఎన్ఎంలు రోడ్డు మీదికి వచ్చినప్పటికీ ప్రభుత్వానికి కనీస పట్టింపు లేకుండా పోయిందన్నారు. వైద్య శాఖలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోకపోగా నూతన నోటిఫికేషన్ వేయడం వారి హక్కులను కాలరాయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నోటిఫికేషన్ రద్దుచేసి ఏఎన్ఎమ్‌లను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారికి అండగా సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఏఎన్ఎంలను బేషరతుగా రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంల రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షులు సంతోషి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఉపాధ్యక్షులు భాగ్య, రజిని, ప్రచార కార్యదర్శి కమల, భూదేవి, ప్రమీల, కోశాధికారి సునీత, నాయకులు తిరుమల, మీనా, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

గొల్ల కురుమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-భీమిని

గొల్ల, కురుమల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని బెల్లంపల్లి ఏఎంసీ చైర్మన్ బోనగిరి నిరంజన్ గుప్తా అన్నారు. గురువారం మండల కేంద్రంలో భీమిని గ్రామానికి చెందిన ఆరుగురికి 6 యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్ల కురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేని విధంగా గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. సామాజికంగా యాదవ, కురుమలు అత్యధిక జనాభా కలిగి ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వాలు యాదవులను పట్టించుకోలేదని, కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని విమర్శించారు. యాదవ, కురుమల అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందిస్తున్న సీఎం కేసీఆర్‌కు యాదవ, కురుమల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి లక్ష్మణ్, జడ్పీటీసీ గంగక్క, ఇన్‌చార్జి పశు వైద్యాధికారి హారిక పాల్గొన్నారు.

జన్నారం : గొల్ల కురుమలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, మండలంలోని తపాలపూర్ గ్రామ సర్పంచ్ నైనాల తిరుపతి డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. గురువారం అపాలపురం గ్రామంలోని ఆరుగురికి ఆరు యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. యాదవులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గోపాల్, విజయ్ పాల్గొన్నారు

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య తెలిపారు. ఇంగ్లీష్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 28న ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో మోడల్ స్కూల్‌లో నిర్వహించే డెమో కు హాజరు కావాలని సూచించారు. ఎంఏ ఇంగ్లీష్, బీఈడీ, ఎంఏ ఎకనామిక్స్ బీఈడీ అభ్యర్థులు అర్హులన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ఎన్నిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం కాగజ్‌నగర్ మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం.రాజేష్, గౌరవాధ్యక్షులుగా ఎం.స్వాతి, ఉపాధ్యక్షులుగా పి.సత్యనారాయణ, ఎం.స్వరూప, ప్రధాన కార్యదర్శిగా టి.మహేష్, ప్రచార కార్యదర్శిగా పి.రాజేందర్, సహాయ కార్యదర్శులుగా జె.సతీష్, కే.మధూకర్, కోశాధికారిగా ఉమేష్, ప్రతినిధులుగా హారికా, రాజేష్, అర్జున్, గీతా, శ్రీకాంత్, లావణ్య, తుకారాంలను ఎన్నుకున్నారు.

జాతీయ స్థాయి దళిత సదస్సును జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశానికి సమగ్ర దళిత అజెండాను ఇవ్వడమే లక్ష్యంగా ఈ నెల 26,27 తేదీలలో హైదరాబాద్ హరిత ప్లాజా బేగంపేటలో నిర్వహించ తలపెట్టిన జాతీయ దళిత సదస్సును జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు 26 రాష్ట్రాల నుంచి 80 విభిన్న సంఘాలకు చెందిన 300 మంది ప్రతినిధులు భాగస్వామ్యం అవుతారని తెలిపారు. రెండు రోజులుగా ఈ జాతీయ సదస్సులో యూజీసీ మాజీ చైర్మెన్ సుక్ దేవ్ తోరాట్, హర్యానా కేడర్ కు చెందిన ఐఏఎస్ అధికారి రాజశేఖర్ ఉండ్రు, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి పాల్గొంటారని తెలిపారు.

ఖానాపూర్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని, ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకురాలు, ఉట్నూరు జడ్పీటీసీ చారులతా రాథోడ్ అన్నారు. గురువారం హైదరాబాదులోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తన అనుచరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. తనకు కాంగ్రెస్ టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. టికెట్ తనకే కేటాయించాలన్నారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో బీఆర్ఎస్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. త్వరలో ఖానాపూర్‌లో ఉన్న అన్ని మండలాలను తిరుగుతూ ప్రచారం చేస్తూ పార్టీ బలోపేతం చేస్తామన్నారు. ప్రజలు తనకు సహకరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఖానాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

26న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బెజ్జూర్

ఈ నెల 26వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మాధవి తెలిపారు. ఈ సమావేశం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు తమతమ నివేదికలతో సమయానికి హాజరుకావాలని ఆమె కోరారు. హాజరు కానీ అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆశా వర్కర్లకు పారితోషికాలు నిర్ణయించాలి

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నగరం పద్మ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశ వర్కర్లకు వెంటనే పారితోషికాలు నిర్ణయించి చెల్లించాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరం పద్మ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సంఘ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు వెంటనే పారితోషికాలు నిర్ణయించాలన్నారు. కనీస వేతనం రూ. 18000 చెల్లించాలని డిమాండ్ చేశారు. 2021 జులై నుండి సెప్టెంబర్ వరకు 6 నెలల పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులను ఇవ్వాలని, 32 రకాల రిజిస్టర్లను వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. క్వాలిటీతో కూడిన ఐదు సంవత్సరాల పెండింగ్ యూనిఫామ్ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. ఆశలకు ప్రసూతి సెలవులపై సర్కులర్‌ను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లు చేస్తున్న ధర్నాకు కాంగ్రెస్ పార్టీ అజ్మీర శ్యాంనాయక్, ప్రజా అధికార పార్టీ కోట వెంకన్నలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, జిల్లా నాయకులు వెలిసెల కృష్ణమాచారి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కోమల, అల్లూరి పంచశీల, శ్రీలత, మోగ్రా, బద్రుబాయి, జల్పత, శోభ, కవిత, అనురాధ, పూజ దేవత, సరోజ, అరుణ, సునీత అన్ని మండలాల ఆశాలు పాల్గొన్నారు.

తాండూర్ : ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని మండలంలోని ఆశావర్కర్లు గురువారం తాండూర్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా వర్కర్లకు 18 వేతనం చెల్లించాలని కోరారు. కంటి వెలుగుతోపాటు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలిపారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి చొప్పున 16 నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలకోరారు. సర్వే రిజిష్టర్లను ప్రభుత్వమే ప్రింట్ చేసి ఇవ్వాలన్నారు. క్వాలిటీతో కూడిన 5 సంవత్సరాల పెండింగ్ యూనిఫామ్స్ వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు(ఆర్‌నీలాదేవి)సీఐటీయూ తాండూర్ మండల ఉపాధ్యక్షులు బాల్లం రాజేశం, రాజేశ్వరి, విజయలక్ష్మి, స్వప్న, సుమంతా పాల్గొన్నారు.

కార్యకర్తల్లో గందరగోళం సృష్టించొద్దు



నవతెలంగాణ-కెరమెరి

కార్యకర్తల్లో గందరగోళాన్ని సృష్టించవద్దని టీపీసీసీ సభ్యుడు రాథోడ్ గణేష్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే టికెట్ నిరాకరించడంతో నిన్న గాక మొన్న హుటాహుటిన హైదరాబాద్‌లోని గాంధీ భవన్ చేరుకొని రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినటువంటి శ్యాంనాయక్ తనకే టికెట్ వస్తుందంటూ ప్రచారం చేసుకోవడం సరైంది కాదన్నారు. గత రెండున్నర ఏళ్లుగా ఆసిఫాబాద్ యోజకవర్గంలో పర్యటిస్తూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపైన తాను పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా నియోజకవర్గంలోని మండలాల్లో కలియ తిరుగుతూ పార్టీ బలోపేతానికి శ్రమిస్తున్నానని తెలిపారు. ఇంద్రవెల్లి దళిత, గిరిజన దండోర బహిరంగ సభ మొదలు యూత్ డిక్లరేషన్ వరకు ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నా, తానే కాంగ్రెస్ అభ్యర్థి నని ప్రచారం చేసుకోలేదన్నారు. నిన్న గాక మొన్న అధికార పార్టీకి చెందిన. ఖానాపూర్ ఎమ్మెల్యే భర్త శ్యాంనాయక్ మూడు నెలల క్రితం తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఏ పార్టీ కండువా లేకుండా తన ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్యే అభ్యర్థులని ప్రకటించిన జాబితాలో ఖానాపూర్ ఎమ్మెల్యే పేరు లేకపోవడంతో కాంగ్రెస్ పాట పాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కలిసి కట్టుగా పని చేస్తామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నంటూ ప్రచారం చేసుకోవడం మానుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే టికెట్ అనేది అధిష్ఠానం నిర్ణయం తీసుకుందన్నారు. శ్యాం నాయక్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇస్తున్నామని కాంగ్రెస్ పార్టీ, చెప్పిందా, లేక అధిష్టానం పెద్దలు చెప్పారా అని ప్రశ్నించారు. ఊరికే కార్యకర్తలను గందరగోళానికి గురి చేస్తే ఊరుకునేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఖరారు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, బాబునాయక్, రమేష్, నిజాం, హన్మంతు, రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ద్వారా ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీల ద్వారా ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఎంపీపీ మల్లికార్జున్ తెలిపారు. మండలంలోని పర్శునంబాలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా కేంద్రాల నిర్వహణ సరిగ్గా లేనట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం గ్రామంలో రూ.3లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన పీరీల షెడ్డుకు భూమి పూజ చేశారు. పర్శునంబల, రౌటసంకేపెల్లి, బొందగూడ ప్రాంతాల్లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశువులకు అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విమలకిష్టయ్య వైద్యాధికారి మురళీకృష సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్ర మంత్రికి సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మహారాష్ట్రలోని అహెరి ఎమ్మెల్యే, ఆ రాష్ట్ర ఆహార, ఔషధ నియంత్రణ శాఖ మంత్రి ధర్మారావుబాబా ఆత్రం గురువారం కాగజ్‌నగర్‌కు రావడంతో ఆయనను స్థానిక బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు నివాసానికి రాగా ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే బంటి భావు భాంగ్డియా, బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌తో పాటు నాయకులు కొంగ సత్యనారాయణ, వీరభద్రచారి, సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, బాల్క శ్యాం, దెబ్బటి శ్రీనివాస్, పిర్సింగుల తిరుపతి, మాచర్ల శ్రీనివాస్, అరుణ్‌లోయ, రాజేందర్ జంజోడ్, చేరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం



నవతెలంగాణ-బెజ్జూర్

మండలకేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బెజ్జూర్ వైద్యాధికారి డాక్టర్ అమన్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అమన్ మాట్లాడుతూ విద్యార్థులు చేతులను శుభ్రం చేసుకున్న తర్వాతనే భోజనం చేయాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు మారుబాయ్, ల్యాబ్ టెక్నీషియన్ దిలీప్‌కుమార్, ఏఎన్ఎం సైదమ్మ పాల్గొన్నారు.

పేద వైద్య విద్యార్థిని ఆర్థిక సాయం

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని రొయ్యల పల్లి గ్రామానికి చెందిన కొండగుర్ల సుమంత్ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కానీ చదువుకోవడానికి ఆర్థిక స్తోమత అడ్డు కావడంతో దాతల కోసం వేచిచూస్తున్న అని ప్రకటన తెలియడంతో ఆలుగామా గ్రామానికి చెందిన బోధిసత్వ సమాజ్ వ్యవస్థాపకుడు దగమ వలిహైదర్ తన వంతు సహాయంగా రూ.ఐదు వేల చెక్కును గురువారం వైద్య విద్యార్థిని అందజేశాడు. దీంతో ముందుగా స్పందించి సహాయం చేసినందుకు వలిహైదర్‌కి సుమంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దాతల సహాయం కోసం వేచి చూస్తున్నట్లు తెలిపారు.

వికలాంగులకు పెరిగిన పింఛన్ అందజేత



నవతెలంగాణ-జన్నారం

సీఎం కేసీఆర్ వికలాంగులకు రూ.4016 పెన్షన్ ఈ నెల నుంచి అమలు చేయడంతో గురువారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీలోని వికలాంగులకు, మండల సర్పంచ్‌ల సంఘం జిడి గంగాధర్ వికలాంగులకు పెన్షన్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నాలుగు వేల పెన్షన్ వికలాంగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వృద్ధులకు వితంతులకు వికలాంగులకు, రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు అందిస్తూ ఎంతో చేయూతని ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వికలాంగులు వితంతువులు వృద్ధాప్య పెన్షన్ దారులు రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామస్తులు పెన్షన్ దారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి బీజేపీ చర్యలు

నవతెలంగాణ-మందమర్రి

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి బీజేపీ అధిష్టానం చర్యలు చేపట్టింది. రాబోయే ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ అధిష్టానం పావులు కదుపుతుంది. గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టత కొరకు చెన్నూరు. నియోజకవర్గంలోని 5 మండలాలు 3 మున్సిపాలిటీలను పరిశీలించడానికి వచ్చిన కర్ణాటక రాష్ట్ర బెంగళూరు ఎమ్మెల్సీ కేశవ్ ప్రసాద్ గురువారం మందమర్రి మండలానికి చేరుకొని పట్టణ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, చెన్నూరు అసెంబ్లీ కన్వీనర్ అక్కుల రమేష్, మందమర్రి పట్టణ అధ్యక్షులు సప్పిడి నరేష్, సొతుకు సంజీవ రావు, దీక్షితులు, గడ్డం శ్రీనివాస్, వెంకటేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

మనవత్వాన్ని చాటిన యూత్ కాంగ్రెస్ నాయకుడు

నవతెలంగాణ-జన్నారం

జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తికి రక్తదానం చేసి జన్నారం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు మంద రాజేష్ మానవత్వాన్ని చాటారు. జగిత్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తికి రక్తం అవసరం ఉందని అక్కడ వైద్యులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న మంద రాజేష్ గురువారం జగిత్యాల ఆస్పత్రికి వెళ్లి అక్కడ రక్తదానం చేశారు. దీంతో రాజేష్‌ను ఆ ఆస్పత్రి వైద్యులు అభినందించారు.

వయోధికుల రక్షణకు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వయోధికుల రక్షణ కోసం పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం హర్షించదగ్గ విషయమని తెలంగాణ ఆల్ సీనియర్స్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వయోధికులు అనాదరణకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వారి రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల ఎనిమిదిన రాష్ట్ర నాయకులు చేసిన వినతి మేరకు డీజీపీ ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు.

కార్మికులకు డబ్బులు చెల్లించే తేదీని ప్రకటించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులకు రావాల్సిన పరిహారం ఎపుడు చెల్లిస్తారో స్పష్టమైన తేదీని ప్రకటించాలని తెలంగాణ ఎస్పీఎం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గోలెం వెంకటేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐదేళ్ల క్రితం ఇస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పటి వరకు దాని ఊసెత్తక, మళ్లీ ఎన్నికలు రాగానే కొత్త నాటకం ఆడడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మిల్లు పున:ప్రారంభమైనా పూర్తి స్థాయిలో కార్మికులను పని లోకి తీసుకోకున్నా, స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించకపోయినా, రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వకపోయినా ఏనాడూ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే ఎందుకు ప్రశ్నించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా పరిహారం చెల్లించే తేదీని ప్రకటించాలని కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, కాగజ్‌నగర్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగాఎం రాజేష్, గౌరవాధ్యక్షులుగా ఎం.స్వాతి, ఉపాధ్యక్షులుగా పి.సత్యనారాయణ, ఎం.స్వరూప, ప్రధాన కార్యదర్శిగా టి మహేష్, ప్రచార కార్యదర్శులుగా పి.రాజేందర్, జి రాజేశం, సహాయ కార్యదర్శులుగా జె సతీష్, కె మధూకర్, కోశాధికారిగా వి ఉమేష్‌కుమార్, అధికార ప్రతినిధిగా పి హారిక, న్యాయ సలహాదారులుగా జె అర్జున్, జి గీత, సభ్యులను ఎన్నుకున్నారు.

పంటల వివరాల సేకరణ

నవతెలంగాణ-బెజ్జూర్

వర్షాకాలం రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలు సేకరిస్తున్నట్టు ఏఈఓ మారుతి తెలిపారు. గురువారం మండలంలోని కుకుడా గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలు క్షేత్రస్థాయిలో తిరుగుతూ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని, రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు చేసుకోవడం ద్వారా దిగుబడులను మార్కెట్‌లో అమ్ముకోవడం సులభం అవుతుందన్నారు. పత్తి పంటలో మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడకూడదని, కలుపు నివారణ సరైన సమయంలో చేపట్టాలని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

ప్రయివేట్ కంపెనీ ఉద్యోగాలకు 25న జాబ్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని కాగజ్‌నగర్ డిగ్రీ కళాశాలలో ప్రయివేట్ కంపెనీ ఉద్యోగాలకు ఈ నెల 26న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ నర్సింగ్ లేదా డిగ్రీ పూర్తి చేసి ఉన్న నిరుద్యోగులు అర్హులని శ్రీవిజయ బయో ఫెర్టిలైజర్ ఆదర్శ మోటార్స్ అపోలో ఫార్మసీ కంపెనీలలో 100 ఉద్యోగాల కోసం ఎంపిక జరుగుతుందని ఆసక్తి అర్హత కలిగిన వారు జాబ్ మేళాకు హాజరై దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారు అన్ని రకాల ధ్రువపత్రాలను తీసుకరావాలని పేర్కొన్నారు. జాబ్ మేళా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3:30 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

నేడు కొలామీ వికీపీడియా అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ఉట్నూర్

కొలామీపై వికీపీడియాలో అనువాదం చేసేందుకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని బోలి చేతో ఫౌండేషన్ సంస్థ సభ్యులు సాయి కిరణ్, మోతీరాం అన్నారు. గురువారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొలామీను వికీపీడియాలో అనుసంధానం చేసేందుకు ఈ నెల 25న స్థానిక కుంరం భీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో నిర్వహిస్తున్నామన్నారు. అంతరిస్తున్న కొలాం భాష, సంస్కృతి, పరిరక్షణకు అందరు కృషి చేయాలన్నారు. కొలామి, గోండి మాతృభాషల్లో వికీపీడియాల్లో వ్యాసాలు, ఆదివాసీ భాషల పునరుద్ధరణకు అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, వరప్రసాద్, జంగు ఉన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ - వాంకిడి

ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్ నాయకులతో పాటు మండలంలోని కమాన, సరండి, కన్నర్‌గావ్ అంబేద్కర్ సంఘం నాయకులు అంబేద్కర్ భవనం మంజూరు చేయాలని గురువారం హైదరాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ బొజ్జను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి మండలంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌కు రూ.50లక్షలు, సరండి, కన్నర్‌గావ్ గ్రామాల్లో అంబేద్కర్ భవనం కోసం మరో రూ.50లక్షలు మంజూరయ్యేలా ప్రతిపాదనలు పంపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పీతాంబర్, అంబేద్కర్ సంఘం నాయకులు దుర్గం శ్యాంరావు, ఉప్రె విజయ్, ప్రతాప్, మహేష్, సురేష్, దీపక్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ హాస్టల్ సందర్శన



నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను గురువారం మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులతో పాటు కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సరిత, వసతిగృహ కేర్ టేకర్ ప్రశాంతి, సీఆర్పీ మంతెన రమేష్ పాల్గొన్నారు.

విద్యాధికారికి సన్మానం

మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో గురువారం నూతన మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్‌ను పీఆర్టీయూ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు బండ శాంకరి, మండల అధ్యక్షులు అన్నం రమణారెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు తణుకు నాగేశ్వర్‌రావు, కుడుదుల శ్రీనివాస్, పల్లె కృష్ణగోపాల్‌రావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా ఈనెల 25న ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వేదవ్యాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్, పట్టణ అధ్యక్షులు లాలా మున్న పాల్గొంటారని తెలిపారు. పార్టీ పదాధికారులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

దుబ్బగూడెం నిర్వాసిత గ్రామంలో గ్రామ సభ



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సింగరేణి కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్ నిర్వాసిత గ్రామమైన దుబ్బగూడెంలో అధికారులు గ్రామ సభ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ సమక్షంలో గ్రామ సభ నిర్వహించారు. కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్‌తో నష్టపోతున్న నిర్వాసిత గ్రామస్తులకు సంబంధించి పునరావాస కల్పనలో భాగంగా సేకరించిన స్థలాల కేటాయింపు కుటుంబాల జాబితా, ఉపాధి, ఆర్థిక సహాయం వివరాలకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నిర్వాసితుల వివరాలను చదవి వినిపించారు. గ్రామస్తులు పలువురి పేర్లు రాలేదని తెలపడంతో మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని, దీనిపై విచారణ చేసి పరిష్కరిస్తామని అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సురేశ్, జీఎం మనోహర్, తహసీల్దార్ వేణుగోపాల్, సీఐ మహేందర్‌రెడ్డి, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, కేకే ఓసీ పీవో రమేశ్ కుమార్, సహకార చైర్మన్ నీలా రాంచందర్, సర్పంచ్ దేవి, ఉప సర్పంచ్ పిట్టల సుమన్, ఎంపీటీసీ, అక్కేపల్లి లక్ష్మీ, కోఆప్షన్ సిరాజ్ ఖాన్, ఎంఆర్ఐ సులోచన, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం



నవతెలంగాణ-ముథోల్

ముథోల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యేను సర్పంచ్‌లు, నాయకులు ఘనంగా సన్మానించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంతో ఎమ్మెల్యేను సన్మానించి అభినందించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేను భారీ మెజార్టీతో గెలిపిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మండల నాయకులు కిష్టయ్య, సర్పంచ్‌లు విజేష్, నాయకులు రాజేశ్వర్, విఠల్‌రెడ్డి, వంశీ, శంకర్ పాల్గొన్నారు.

వాయిదాపడ్డ షాపులకు రీ టెండర్ నోటిఫికేషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 40 మద్యం షాపులను గాను, 31 మద్యం షాపులకు లక్కీడ్రా ప్రక్రియ ముగిసింది. మిగతా 9 షాపులకు 10లోపు దరఖాస్తులు రావడంతో వాయిదా వేశారు. కాగా ఆ 9 వైన్స్ షాప్‌లకు రీ టెండర్ ప్రక్రియ చేపడుతున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో-2, ఉట్నూర్ పరిధిలో-1, ఇచ్చోడ పరిధిలో-6 వైన్స్‌లకు ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు టెండర్లు సంజయ్‌నగర్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో దాఖలు చేయాలని తెలిపారు. 29న కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో టెండర్ దరఖాస్తుల డ్రా తీయడం జరుగుతోందని పేర్కొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

నవతెలంగాణ-ముథోల్

మండలంలో గురువారం డీఎల్పీఓ శివకృష్ణ, గృహలక్ష్మి దరఖాస్తుల ఇంటింటి సర్వేను పరిశీలించారు. సంబంధిత సర్వేను పారదర్శకంగా, వేగవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ వేతనం ఇచ్చేవరకూ పోరాటం

- గాంధీ విగ్రహానికి ఆశాల వినతి



నవతెలంగాణ-నిర్మల్

ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇచ్చేవరకు పోరాటం ఆపేది లేదని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆశాలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక పనుల ఒత్తిడి తట్టుకొని, నిత్యం సేవలు అందిచటం వల్ల జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డ్స్, రివార్డ్ వచ్చాయన్నారు. కనీస వేతనం నిర్ణయించాలని ఆందోళన చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటాలు చేస్తామన్నారు. 26న తహసీల్దార్ కార్యాలయం ఎదుట , 29న ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం కరోనా రిస్క్ అలవెన్స్ తన ఖాతాలో వేసుకుంది కానీ విడుదల చేయడం లేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫిక్స్‌డ్ వేతనం రూ.10000 అమలు చేస్తున్నారని, కేరళ రాష్ట్రంలో రూ.18000 ఇస్తున్నారని, ధనిక రాష్ట్రం, బంగారు తెలంగాణలో కనీసం ప్రమాద బీమా సౌకర్యం పొందలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.సుజాత, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు విజయ, సుగుణ, భాగ్య, సుజాత, విజయ, ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లి పేరు మీద సేవ చేయడం గొప్ప విషయం



నవతెలంగాణ-బోథ్

మనకు జన్మనిచ్చిన తల్లి పేరు మీద సేవ చేయడం చాలా గొప్ప విషయమని బోథ్ సీఐ భీమేష్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రహ్లాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ, సాయినగర్ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో మాసం అనిల్ తన తల్లి మాసం లక్ష్మీ 15వ వర్ధంతి సందర్భంగా మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాసం అనిల్ తన తల్లి చనిపోయి 15 సంవత్సరాలు అయినప్పటి నుంచి తల్లి పేరు మీద స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి సేవలు చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రతి సంవత్సరం వర్ధంతి రోజు ఏదో ఒక సేవలు చేస్తూ, ముందుకు రావడం జరిగిందన్నారు. 15వ వర్ధంతికి విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ బుక్స్ అందజేశారు. అలాగే విద్యార్థులు బాగా చదివి తల్లి తండ్రులను పెద్దగా అయ్యాక తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్రవంతి, ఎంపీటీసీ కుర్మే మహేందర్, వార్డు సభ్యులు నల్ల గంగయ్య, అపర్ణ, రవి, సామాజిక సేవకులు, జక్కులవార్ వెంకటేష్, అబుద్, లింగంపల్లి రాజేష్, సిటిజన్ యూత్ సభ్యులు రవి, రాహుల్, సన్ని, నరేష్, మల్లికార్జున్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ దేశాలను అబ్బురపరిచేలా జరిగిన చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్ అయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ల్యాండింగ్ విజయం పట్ల గురువారం బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మహారాష్ట్ర ఆర్ణి ఎమ్మెల్యే సందీప్ దుర్వే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ గీతాలపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అద్భుతమైన ఘట్టం 140 కోట్ల మంది భారతీయుల కల నెరవేరిన క్షణం ఇస్రో శాస్త్రవేత్తలు కష్టపడ్డ ఫలితానికి ఈరోజు 140 కోట్ల మంది ప్రజలే కాక విజయోత్సవ సంబురాలు జరపడంలో ఇతర దేశాలు సైతం బారులు తీరిన క్షణం కనుల విందుగా అనిపిస్తుందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రపంచ దేశాలని శాసించే విధంగా తయారవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రవేత్తలకు ఇవ్వాల్సిన స్వాతంత్ర్యాన్ని ఇవ్వకపోవడంతోనే కాంగ్రెస్ పరిపాలించినప్పుడు ఇలాంటి ఘనతలను మనం సాధించలేకపోయామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల తరపున ఇస్రో శాస్త్రవేత్తలకు, నరేంద్ర మోడీకి శుభాభినందనలు తెలియజేశారు.

ఇస్రో విజయం పట్ల చిన్నారుల సంబురాలు

చంద్రుడిపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్ కావడం పట్ల జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, చిన్నారులు, పెద్దలు అందరూ సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చిన్నారులు, విద్యార్థులు సంబురాలను చేసుకున్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఐ లవ్ ఆదిలాబాద్ సెల్ఫీ పాయింట్ దగ్గర పలువురు, చిన్నారులు, విద్యార్థులు కేక్ కట్ చేసి జాతీయ జెండాను పట్టుకొని తమ దేశభక్తిని చాటారు. ఇస్రోకు అభినందనలు తెలిపారు. అంతరిక్షంలో దక్షిణ ధృవంపై ల్యాండింగ్ అయినందుకు భారత ప్రతిష్ట మరింత పెరిగిందని, ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని చిన్నారుల తల్లిదండ్రులు పేర్కొన్నారు.

అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడువాలి



- జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్

నవతెలంగాణ-నార్నూర్

సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడిచి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని ఖంపూర్ గ్రామంలో అన్నాభావు సాఠే 103వ జయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖంపూర్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్నాభావు సాఠే అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నర్సింగ్ మోరే, స్థానిక సర్పంచ్ సలాం ఆనంద్‌రావ్, దళితహక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు జాదవ్ తిరుపతి, ఖైర్‌డాట్వా కనక సేవంత ప్రభాకర్, కాంబ్లే సుదర్శన్, నాయకులు తిరుపతి, రాథోడ్ సుభాష్, కోరాల మహేందర్, మాజీ ఎంపీటీసీ రమేష్, అహ్మద్, దావుల రమేష్, కాంబ్లే హనమంత్, కమిటీ అధ్యక్షుడు సూర్యవంశి ఆనంద్, సొలంకే బాలాజీ, సూర్యకాంత్, కార్యదర్శి కాశీరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీ కార్పొరేట్ జీఎం పర్యటన



నవతెలంగాణ-మందమర్రి

నూతన జనరల్ మేనేజర్ సీహెచ్‌పీ ఈఅండ్‌ఎం కార్పొరేట్‌గా బాధ్యతలు స్వీకరించిన నవీన్ కుమార్ గురువారం మందమర్రి ఏరియాలో పర్యటించారు. కేకే వన్ ఓల్డ్ సీహెచ్‌పీ సైడింగ్, ఆర్కేపి సీహెచ్‌పీకి సంబంధించిన పనులు వాటి ప్లాన్లను ఏరియా అధికారులతో చర్చించారు. పనులకు సంబంధించి సూచనలు సలహాలను అధికారులకు తెలిపారు. మొదటిసారి ఏరియాకి వచ్చిన ఆయనను ఏరియా జీఎం మనోహర్ అధికారులతో కలిసి సన్మానించారు.

నస్పూర్ : శ్రీరాంపూర్ ఉపరితలగనిలో ఉన్న కోల్ ప్లాంట్, శ్రీరాంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డితో కలిసి కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్స్ జనరల్ మేనేజర్(కార్పొరేట్) నవీన్ కుమార్ గురువారం సందర్శించారు. ముందుగా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన నవీన్ కుమార్ ను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ శాలువా కప్పి పూల మొక్కతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఇంచార్జ్ ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని పోస్టు కార్డు ఉద్యమం



నవతెలగాణ-జన్నారం

సమగ్ర శిక్ష ఒప్పంద పద్దతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యర్యంలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ గత 15 ఎళ్లుగా ఎంఆర్సీలో వివిధ విభాగల్లో పని చేస్తు విద్యాశాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న తమకు ప్రభుత్వం ఇప్పటికి ఉద్యోగ భద్రత కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతన స్కేలును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం నాయకులు రాంటెంకి బుచ్చన్న, దయాకర్,నారయణ,విజయ్,అజారొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

తలసాని క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-భైంసా

హైదరాబాదులోని స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబును అవమానించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ క్షమాపణ చెప్పాలంటూ గురువారం భైంసాలో లంబాడాలు భారీ ర్యాలీ చేపట్టారు. రైతుల ప్రతినిధి అయిన రాజేష్‌బాబును అవమానించడం తమ జాతికే అవమానమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో నిరవధిక దీక్షకు పూనుకుంటామన్నారు. ఈ పోరాటం త్వరలో రాష్ట్ర వ్యాప్తం చేస్తామని గిరిజన సంఘ నాయకులు హెచ్చరించారు. భైంసాలోని చెక్ పోస్ట్ నుండి బస్టాండ్ వరకు వందలాదిమంది ప్రజలు తరలివచ్చి ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకో గంట పాటు సాగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మంత్రి తలసాని దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘం నాయకులుపాల్గొన్నారు.

మైనార్టీ అభ్యర్థులకు ఎమ్మెల్యే అవకాశం కల్పించాలి



నవతెలంగాణ-నార్నూర్

జిల్లాలో మైనార్టీ ప్రజలు చాలా వెనుకబడి ఉన్నారని, జిల్లా మైనార్టీ నాయకులను గుర్తించి ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి మైనార్టీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షులకు మండల మైనార్టీ నాయకులు విన్నవించారు. గురువారం మండల కేంద్రంలో జామా మజీద్‌లో మత పెద్ద నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10 నియోజకవర్గాలు ఉన్నాయని అన్నారు. మైనార్టీ ప్రజల ఓటు బ్యాంక్‌ను వినియోగించుకుంటున్నారని అన్నారు. కరోనా కష్టకాలంతో మతతత్వ రాజకీయాలలో మతబేధాలు లేని మానవత్వం చాటిన సాజీద్‌ఖాన్‌ను గుర్తించి ఆదిలాబాద్ నియోజకవర్గంలో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మైనార్టీ మతపెద్దలు జామా మసీద్ సదర్ ఖాదర్‌ఖాన్, మొహమ్మద్ ఖురేషి, మౌలానా రఫీక్, షేక్ అప్సర్, షేక్ మూసా, గులాం నబి, మన్సూర్ ఖాన్, హాజీ హసన్ ఖాన్, సయ్యద్ అన్వర్, షేక్ వజీర్, జాకిరుల్లా ఖాన్, సయ్యద్ ఖాజా, షేక్ అజీమ్, ముస్తఫా, కరీమ్ ఖాన్, అజమ్, సౌకత్ రఫీక్ ఉన్నారు.

చంద్రయాన్-3పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-తలమడుగు

చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా మండలంలోని ఖోడద్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. 14న శ్రీహరికోటలో నుంచి చంద్రుడిపై పంపిన నాటి నుంచి ఆగస్టు 23 సాయంత్రం 6 గంటల నాలుగు నిమిషాల వరకు జరిగిన ప్రక్రియను కండ్లకు కట్టినట్లు ప్రయోగాత్మకంగా విద్యార్థులకు బోధనోపకరణాల మాధ్యమంతో సైన్స్ ఉపాధ్యాయురాలు సురేఖ విద్యార్థులకు వివరించారు. 15 నిమిషాల పాటు టీచర్ వివరించిన తీరు పట్ల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని తెలిపారు. చంద్రయాన్-3 విజయవంతంగా ప్రయోగించి, భారతదేశ కీర్తి పతాకాన్ని చంద్రమండలంపై ఎగరవేశారు. దీనిని యావత్ 140 కోట్ల భారతీయులు గర్విస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తల కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వెంకన్న, లక్ష్మి, సుకుమార్ పెట్కూలే, వాసుదేవ్, ఎస్.సురేఖ, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కోటపల్లి

ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సర్పంచ్‌లు తమ గ్రామాల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎంపీపీ మంత్రి సురేఖ అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు హస్గర్, వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కృష్ణవేణి విద్యార్థులకు వ్యవసాయం అవగాహన

నవతెలంగాణ-ఖానాపూర్



కృష్ణవేణి పాఠశాల 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా పంట పొలాలను సందర్శించారు. ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామంలోని వ్యవసాయ పంట పొలాల్లో విద్యార్థులు నాట్లు వేశారు. వ్యవసాయదారులతో మాట్లాడారు. వ్యవసాయ పద్ధతులు పనితీరు వివిధ రకాల పంటల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల గురించి అలాగే ఆహార మొక్కల ప్రాధాన్యతను మొదలైన విషయాలను, రైతులను, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్వేత, కరస్పాండెంట్ గాండ్ల కీర్తి ఉన్నారు.